క్లుప్తంగా

అందుబాటులో విద్యాకానుక కిట్లు



విద్యా వనరుల కేంద్రానికి చేరిన విద్యాకానుక కిట్లు

రాజవొమ్మంగి: మండల విద్యావనరుల కేంద్రానికి శనివారం తొలివిడతగా 1,468 విద్యాకానుక కిట్లు సరఫరా అయ్యాయి. ఇందులో మినీ, మీడియం సైజు స్కూల్ బ్యాగులుఉన్నట్టు ఎంఈవో సూరయ్యరెడ్డి, సీఆర్‌పీ శ్రీనివాస్ తెలిపారు. పెద్ద తరగతులకు ఇంకా రావాల్సి ఉందన్నారు. కాగా మండలంలోని 97 పాఠశాలలకు సంబంధించి ఇప్పటికే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం క్లాత్ సరఫరా అయిన సంగతి తెలిసిందే.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్‌రోలర్‌ను ఢీకొన్న బైక్

రాజవొమ్మంగి: స్థానిక యూనియన్ బ్యాంకు ఎదురుగా శనివారం ఓ ప్రమాదం తృటిలో తప్పింది. ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకొన్నారు. మండలంలోని గింజర్తి గ్రామానికి చెందిన కొంగర చిన్న తన కుటుంబంతో మోటారు సైకిల్‌పై రాజవొమ్మంగి వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతున్నాడు. ఈ క్రమంలో హైవే పనులు చేస్తున్న రోడ్ రోలర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టి పడిపోయాడు. ప్రమాదంతో ఎవరికీ గాయాలు కాలేదు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: గాదిరాయి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఇక్కడ స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు కె.జె.పురంలో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఈ నెల 24న విశాఖ అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు భానోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎక్స్‌రే, ఇతర స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి అదే రోజు ఆస్పత్రి బస్సులో సంగినవలస తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. కళ్లు, కాలు, చేతులు, నడుమ, గుండె, మూలవ్యాధి, హెర్నియా, కిడ్నీ, తదితర శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించి ఇంటికి పంపిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9885650716 సంప్రదించాలని కోరారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు/కశింకోట: తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.గ్రేస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 6వ తరగతిలో ఎస్సీలకు 29, ఎస్టీ, బీసీలకు చెరొకటి, 7వ తరగతిలో ఎస్సీలకు 3, ఎనిమిదో తరగతిలో ఎస్సీలకు 2, ఓసీలకు ఒకటి, 9వ తరగతిలో ఎస్సీలకు 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 26లోగా గురుకుల పాఠశాలలో నేరుగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వేసవి దుక్కులతో భూమికి సారం

- తెగుళ్ల నివారణకు మేలైన మార్గం
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



డముకులోని వేసవి దుక్కులు చేస్తున్న రైతులు

అనంతగిరి: పంట పండించే ముందు భూసారం పెంచుకోవడం తెలివైన పని. వరసపెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమైపోతాయి. అందుకనే మన పూర్వీకులు ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు పండించిన భూముల్లో వేసవి దుక్కులు చేపట్టి, భూసారాన్ని కాపాడేవారు. ఆధునిక కాలంలోని పంటలు పండించడంపై చూపిస్తున్న మక్కువ భూసారంపై చూపించడం లేదు. రబీ తర్వాత వేసవిలో ఆయా భూముల్లో దుక్కులు చేపట్టడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

సంప్రదాయ పద్ధతి

మన పూర్వీకులు ఏ పనిచేసిన అప్పటి ప్రయోజనాలతో పాటు భవిష్యత్ గురించి ఆలోచించేవారు. ముఖ్యంగా వ్యవసాయంలోని భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన పంటలను పండించే దిశగా అడుగులు వేసేవారు. ఖరీఫ్ సీజన్ సమాయత్తమయ్యే వేళల్లో పొలాల్లో వేసవి సమయంలోని దుక్కులు చేపట్టి, భూసార పరిరక్షణకు చర్యలు తీసుకునేవారు. కాలక్రమంలో అన్నదాతలు ఆధునిక పేరుతో వేసవి దుక్కులు చేపట్టడం చాలవరకు మానేశారు.

మంచి దిగుబడులు

మెట్ట ప్రాంతంలోని ముఖ్యంగా వరిసాగులో ముందుండే అల్లూరి జిల్లా గిరిజనులు చాల మంది వర్షాలు కురిసిన వెంటనే వేసవి దుక్కులు చేస్తుంటారు. అయితే ఎండల తీవ్రతతో భూములు కూడా భగభగమంటూ కాగిపోతున్న తరుణంలో దుక్కులు చేయడం ఎలా అని చాలా మంది రైతుల్లో సందేహం రావచ్చు. బోర్లు, సాగునీటి సదుపాయం ఉన్నవారు ఇప్పటికే వేసవి దుక్కులు ప్రారంభించారు. మిగిలిన వారు నైరుతి రుతుపవనాలు ఈసారి నిర్ణీత సమయంలోని వచ్చే అవకాశాలు ఉన్నాయని, వాతావరణశాఖ చెబుతున్న నేపథ్యంలోని కాస్తోకూస్తో వర్షాలు పడిన వెంటనే చేపట్టవచ్చుని ఆశిస్తున్నారు. వేసవి దుక్కిలు చేపట్టి పశువుల పెంట వేయడం ద్వారా ఆయా భూముల్లో భూసారం వృద్ధి చెంది. సాగుచేసే పంటలు మంచి దిగుబడి ఇస్తాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

- వేసవిలో పొలాలను దుక్కు చేయడం వల్ల ఆయా పొలాల్లో పెరిగిన గడ్డి నశించిపోవడంతో పాటు వరిమోనలు కుళ్లి భూమిలో కలిసిపోయి ఎరువుగా మారుతాయి.
- భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు బయటకి రావడం వల్ల వాటిని పక్షులు ఆహారంగా తీసుకుంటాయి. తదుపరి వేసే పంటలకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి.
- పక్షులు ఆహారంగా తీసుకున్న తరువాత మిగిలిన పురుగులు ఎండతీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆ పొలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు కూడా ఈ ఎండలకు చనిపోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటాయి. సాగుచేసే పంటలకు తెగుళ్ల బెడద నివారించవచ్చు.
- రైతు ఇదే సమయంలోని దుక్కుచేసి పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూమి సారాన్ని కూడా పెంపొందించుకునే అవకాశం ఉంటుంది.

వేసవి దుక్కులు చేయడం మంచిది



మన పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే వాటిలో భూసారం కరిగిపోతుంది. ఈ సమస్యను నివారించేందుకు పొలాల్లో వేసవి దుక్కుల చేపట్టడం ఎంతో అవసరం. రబీ పంట తర్వాత పొలాల్లో వేసవి దుక్కులు చేయడం వల్ల చీడపురుగులు, శిలీంద్రాలు చనిపోతాయి. గడ్డి, గరప కుళ్లి, నేలసారవంతంగా తయారవుతుంది. వేసవిదుక్కులు చేసిన పొలాల్లో తెగుళ్ల బెడద చాలా వరకు ఉండదు. ఫలితంగా పంటల దిగుబడులు బాగుంటాయి.

–ఉమామహేశ్వరి, ఏవో అనంతగిరి

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



అమీనాబాద్‌లో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వ్యక్తిగత పరిశుభ్రతపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న జడ్డంగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఇందులో భాగంగా భోజనం చేసే ముందు, కాలకృత్యాలకు వెళ్లి వచ్చినపుడు తప్పనిసరిగా చేతులు సబ్బుతో గాని లిక్విడ్ సోప్‌తో గాని శుభ్రం చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. సీజనల్ వ్యాధులపై తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.విక్టోరియా ప్రమీల పర్యవేక్షించారు. ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, హెచ్‌వీలు రమణ, చిన్నయమ్మ, ఏఎన్‌ఎం మల్లేశ్వరి, 104 డీఈవో శ్రీనివాస్, పైలట్ కనకరాజు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ పనులు ప్రారంభించాలి



శ్మశానవాటికి స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి తదితరులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని శ్మశాన వాటికలను జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులతో శనివారం పర్యటించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అరకులోయ పట్టణంలో ఉన్న మూడు శ్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణం కోసం రూ.50లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రహరీ నిర్మించకపోవడంతో శ్మశానవాటిక భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని త్వరితగతిన ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కమిడి అశోక్‌కుమార్, పరుశురాం, గ్రామస్తులు, జగన్నాథం, నాయుడు, మగ్గన్న, రెహమాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బడిఈడు పిల్లలు ఉండేలా చర్యలు



కొంతలం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో బాబూరావు పడాల్



గెంజిగెడ్డ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో పనసల ప్రసాద్



చౌటముఖిపుట్టులో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ చౌటముఖిపుట్టు ఎంపీపీ పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. విద్యార్థులచే పాఠ్య పుస్తకాలను చదివించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలు పాఠశాలలో ఉండాలని ఉద్దేశ్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తున్నారని, గ్రామాల్లో ఉపాధ్యాయులు పర్యటించి, పాఠశాలల్లో పిల్లలను చేరించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, బడి బయట పిల్లలు లేని గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కోరారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమంపై ప్రత్యేక డ్రైవ్‌ను మండలంలో 23 పంచాయతీల్లో ఉపాధ్యాయులు నిర్వహించాలని ఎంఈవో సూచించారు. ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, పూర్ణచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను బోధించాలి

జి.మాడుగుల: పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించటానికి ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈవో సీహెచ్. బాబూరావుపడాల్ ఆదేశించారు. మండలంలో మారుమూల గ్రామాలైన ఏడుసావళ్లు, చీకుంబంధ, కొంతలం, కరకపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన శనివారం తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థుల విద్యాసామర్థ్యలను పరిశీలించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పాఠశాల ఆవరణలో గల అసంపూర్తి మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని, నేను బడికి పోతా కార్యక్రమాలను నిర్వహించి బడిలో చేర్పించాలని ఆయన ఆదేశించారు. బడి బయట పిల్లల పట్ల ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూరుశాతం హాజరు తప్పనిసరి

చింతపల్లిరూరల్: పాఠశాలలో నూరుశాతం హాజరు ఉండేలా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు చర్యలు తీసుకోవాలని ఎంఈవో పనసల ప్రసాద్ అన్నారు. మండలంలో గెంజిగెడ్డ, పెంటపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి రోజు విద్యార్థుల 100 శాతం హాజరు వచ్చేలా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించలన్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని లేని యెడల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలకు యూనిఫాంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ అప్పలరాజు, సర్పంచ్ సూరిబాబు తదితరులు

జి.మాడుగుల: మండలంలోని సుర్మతి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్‌లను శనివారం ఎంపీటీసీ సభ్యుడు లంబూరి అప్పలరాజు, సర్పంచ్ సూరిబాబు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలు వినియోగించుకొని విద్యాభివృద్ధి చేసుకోవాలని కోరారు. హెచ్ఎం అంబిడి శ్యాంసుందరం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి.మత్స్యకొండబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న లారీ



బ్రేకులు ఫెయిల్ కావడంతో చెట్టును ఢీకొట్టిన లారీ

చింతపల్లిరూరల్: విశాఖపట్నం నుంచి చింతపల్లికి విద్యుత్ శాఖకు సంబంధించిన స్తంభాలు ఇతరత్రా సామగ్రి తీసుకొచ్చిన లారీ శనివారం స్థానిక ఆర్ఎంబీ కార్యాలయం వద్ద బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి చెట్టును ఢీకోంది. ప్రమాదానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నుంచి తీసుకొచ్చిన విద్యుత్ స్తంభాలు, సామగ్రిలో కొంత స్టాకును చింతపల్లిలో శనివారం ఉదయం 5గంటలకు దింపుకొని మిగిలిన సరకుతో గూడెం కొత్తవీధి వెళ్తున్న లారీ స్థానిక హనుమాన్ జంక్షన్ మలుపు వద్ద బ్రేకులు ఫెయిల్ అవడంతో వెనక్కి వెళ్తూ చెట్టును ఢీకొంది. లారీ వెనుక్కి రావడంతో స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కొయ్యూరు: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో స్వామి వజ్ర కవచాలంకృత ధారణతో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పూలమాలలు, తులసి మాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. దీప హారతి నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రారంభం



ఆలయాన్ని ప్రారంభిస్తున్న గ్రామస్తులు

హుకుంపేట: మఠం పంచాయతీ ఎం.కొత్తురు గ్రామంలో దేవదాయ ధర్మదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని శనివారం వైదిక ఆచారాలతో, వేద మంత్రాల నడుమ స్థానిక సర్పంచ్ మఠం శాంతకుమారి, స్థానిక పెద్దలతో కలిసి వైభవంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సర్పంచ్‌తో పాటు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్యకొండబాబు ఆలయ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలన్నారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టెండర్ గడువు పెంపునకు వినతి



ఎంపీపీ ఉషారాణి, పాలకవర్గ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

అరకులోయ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్వహణ టెండర్ కాలపరిమితి ముగిస్తుండడంతో రీటెండర్‌కు ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన పాలకవర్గ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉషారాణి మాట్లాడుతూ సభ్యుల అభిప్రాయం మేరకు 12 షాపులతో ఉన్న కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్వహణకు రీటెండర్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే తీర్మాణం చేశామని సభ్యుల ఆమోదం మేరకు పత్రిక మూలంగా ప్రకటిస్తామన్నారు. గతంలో టెండర్ ద్వారా దుకాణాలు దక్కించుకున్న నిర్వాహకులు లక్షల రూపాయల్లో బకాయి ఉన్నారని, వారికి రీటెండర్ నుంచి మినహాయించనున్నట్టు తీర్మాణం చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా వ్యాపార సముదాయంలో దుకాణాల నిర్వహణకు సంబంధించిన కాలపరిమితి పెంచాలని కోరుతూ షాపుల యజమానులు ఎంపీపీ ఉషారాణి, పాలకవర్గ సభ్యులకు వినతి పత్రం అందజేశారు. దుకాణాల టెండర్ దక్కించుకుని వాటికి అదనంగా పెట్టుబడులు పెటుకున్నామని, రీటెండర్ కాకుండా కాలపరిమితి పెంచాలని వారు కోరారు. వైస్ ఎంపీపీలు రామన్న, సుమాంజలి, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్‌కుమార్, శత్రుఘ్న, రాంచందర్, దుకాణ యజమానులు రామారావు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలు ప్రారంభం



విద్యార్థినికి ప్రవేశపత్రాన్ని అందిస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర, ప్రిన్సిపాల్ లక్ష్మి

వై.రామవరం: మండలంలోని తోటకూరపాలెం కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ప్రిన్సిపాల్ కె.వి.వి.లక్ష్మి అధ్యక్షతన ఎంఈవో కె.తాతబ్బాయిదొర పాల్గొని విద్యార్థిలను పాఠశాలలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో తాతబ్బాయిదొర మాట్లాడుతూ విద్యాలయంలో అన్ని సబ్జెక్టులకు నైపుణ్యం గల బోధన సిబ్బంది ఉన్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమైనట్టు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు.

పాఠశాలలో తనిఖీలు

మండలంలోని చవిటిదిబ్బలు పంచాయతీ తోటకూరపాలెం కేజీబీవీని శనివారం ఎంఈవో కె.తాతబ్బాయి దొర సందర్శించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ తప్పకుండా పాటించాలని ప్రిన్సిపాల్ లక్ష్మీకు సూచించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. బోధన విధానాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాదేవి తదితరులు

గంగవరం: గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాదేవి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్ ఆధ్వర్యంలో గంగవరం, కుసుమరాయి, రాజంపాలెం, ఆముదాలబంద గ్రామాలకు చెందిన 150 మంది రైతులకు ఆర్‌జీఎల్, టీఎంటీయూ 1064 రకం వరి విత్తనాలు పంపిణీ చేశారు. గంగవరం, ఆముదాలబంద సర్పంచ్‌లు అక్కమ్మ, రాజ మ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు చిన్నారావు, వ్యవసాయ సహాయకులు రేహానా సుల్తానా, కార్యదర్శి కృష్ణ స్వామి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అర్జున్, సర్పంచ్ కామరాజు దొర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు



చింతపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ అరుణ్‌కిరణ్



పి.యర్రగొండలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

చింతపల్లిరూరల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ అరుణ్ కిరణ్ అన్నారు. స్థానిక ఏపీఆర్ కళాశాలలో శనివారం విద్యార్థులతో ఆయన మమేకమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్‌కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి రవాణా, మద్యపానం సేవించడం వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కర్యాకాలపాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు.

వై.రామవరం: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, తదితర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి, మద్యం, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైదాన ప్రాంత విద్యార్థులకు దీటుగా ప్రతీ గిరిజన విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి గిరిజన ప్రాంత సత్తాను చాటాలన్నారు. విద్యతో పాటుక్రీడల్లోనూ రాణించి, ప్రపంచ స్థాయికి చేరుకుని, తల్లిదండ్రులు, గురువులతో పాటు, గిరిజన ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై పలు సూచనలిచ్చారు. ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకుంటే బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శైలజ

నాతవరం: ఖరీఫ్ సాగు కోసం వరి విత్తనాలు వేసుకునే రైతులంతా కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఏవో శైలజ తెలిపారు. స్థానిక ఆర్బీకేలో శనివారం ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయడం వల్ల నారు పోసిన ప్రతి గింజ మొలకెత్తుతుందన్నారు.

దీని వల్ల రైతుకు వరినారు సమస్య లేకుండా ఉంటుందన్నారు. వరి విత్తనాలు 30 కేజీలకు 250 గ్రాముల సుడోమోనాస్ పొడరు వరినారు వేసే ముందు రోజున కలపాలన్నారు. దీని వల్ల విత్తనాల్లో క్రిమికీటకాలు నాశనమవుతాయన్నారు. వరి నారు ఏపుగా పెరుగుతుందన్నారు. విత్తన శుద్ధి చేసే సుడోమోనాస్ మందు 50 శాతం రాయితీపై రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. సుడోమోనాస్ కేజీ ప్యాకెట్ రాయితీ పోగా రూ.40కే ఇస్తున్నామన్నారు. మండలంలో ఆర్బీకేల్లో 500 కేజీల సుడోమోనాస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల ఆయకట్టులో వరినాట్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులు సాగుకు తగ్గట్టుగా వివిధ రకాల వరి విత్తనాలు 1,700 క్వింటాళ్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. ముందుగా ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి పంపిణీ చేస్తున్నామన్నారు.